క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ వైర్లు


రోడ్డుపైకి ఒరిగిన వెదురు బొంగులు

సీతానగరం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణతో పాటు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. మక్కువ–అజ్జాడ బీటీరోడ్డులో బుడ్డిపేట సమీపంలో వెదురుబొంగులు విద్యుత్ తీగలపై పడి రోడ్డుకు అడ్డంగా వేలాడటంతో విద్యుత్ సిబ్బంది సోమవారం వాటిని సరిచేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. వర్షాలు కురుస్తున్నందున వీధుల్లోని విద్యుత్ స్తంభాలను పశువులను కట్టొద్దని సిబ్బంది సూచించారు.

నదిలో కొట్టుకుపోయిన ఆవు

మక్కువ: మండలంలోని సరాయివలస గ్రామంలో రైతు అల్లు రవికి చెందిన ఆవు గోముఖీనది ఉధృతకు కొట్టుకుపోయింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజులు క్రితం గోముఖీనది ఆవలి ఒడ్డుకు పశువులను మేతకు తీసుకువెళ్లి, తిరిగి వస్తుండగా నదిలో వరద ప్రవాహం ఉధృతంగా రావడంతో ఓ ఆవు ప్రవాహంతో పాటు కొట్టుకుపోయింది. ఆదివారం నదీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఆవును వెతకగా, నదిలో ఇసుక మేటల మధ్య మృతి చెంది ఉందని తెలిపారు. వెటర్నరీ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారని రైతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం మంజూరు చేయాలని ఆయన కోరుతున్నారు.

ఘనంగా గణనాథుని ఊరేగింపు


మక్కువలో వినాయకుని ఊరేగింపు

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలను సోమవారం నిమజ్జనం చేశారు. మండల కేంద్రం మక్కువలోని నాయుడువీధి, ఎస్సీవీధి, నెయ్యలవీధి, కూరాకులవీధి, గంట్యాడవీధిల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను డప్పులు, డాన్సుల మధ్య ఘనంగా ఊరేగించి గంగలో నిమజ్జనం చేశారు. చిన్నారులు, యువత ఉత్సాహంగా డాన్సులు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే మక్కువ, కొండబుచ్చమ్మపేట, తదితర గ్రామాల్లో గణపతి మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డుపై కూలిన చెట్టు


రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కొత్తవలస గ్రామానికి వెళ్లే రహదారిపై చెట్టు నేలకొరిగింది. సర్పంచ్ నిమ్మక నీలావతి సోమవారం పారిశుద్ధ్య కార్మికుల సాయంతో చెట్టు కొమ్మలను నరికించి మానును పక్కకు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు.

గోతులు పూడ్చివేత

గరుగుబిల్లి: పార్వతీపురం–గరుగుబిల్లి ప్రధాన రహదారిలో ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద రహదారిపై ఏర్పడిన గోతుల కారణంగా వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు గోతులు పూడ్చాలని సంకల్పించారు. ఈ మేరకు సోమవారం ట్రాక్టర్లతో గ్రావెల్ తెప్పించి రహదారి గోతుల్లో వేసి చదును చేయించారు. రాకపోకలకు రహదారి అనుకూలంగా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై సేవలను అభినందిస్తున్నారు.

కారుతున్న ఆస్పత్రి భవనం


లీకవుతున్న పైకప్పు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఇటీవల పైఫ్లోర్‌లో నిర్మించిన భవనం పైకప్పు కారుతోంది. రూ.20 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే పై ఫ్లోర్‌లో ఒక భాగం పూర్తి చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఒకటి, రెండు చోట్ల పగుళ్లు రావడంతో నీరు లీకవుతోంది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. తమకు ఇంకా భవనాలు అప్పగించలేదన్నారు.

ఇన్‌చార్జిల పాలనతో..

కుంటుపడుతున్న అభివృద్ధి

- రెగ్యులర్ ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలు లేక పాలన అస్తవ్యస్తం
- ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఎవ్వరినీ కేటాయించని వైనం
- గ్రామాల్లో అభివృద్ధి, సచివాలయాలపై కొరవడిన పర్యవేక్షణ



వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయం

వీరఘట్టం: ఇన్‌చార్జి అధికారుల పాలనలో మండలంలో అభివృద్ధి కుంటుపడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల బదిలీలు జరిగినప్పటికీ ఇక్కడకు రెగ్యులర్ అధికారులను ప్రభుత్వం నియమించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. అలాగే ఏళ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పాతుకుపోవడంతో ఏ అధికారి ఎప్పుడు వస్తున్నాడో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఎంపీడీఓ కుర్చీ రెండేళ్లుగా ఖాళీగానే ఉంది. ఇటీవల ఎన్నికల ముందు రెగ్యులర్ ఎంపీడీఓ బదిలీపై వచ్చారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆయన మరలా బదిలీపై వెళ్లిపోయారు. అంతకు ముందు గతేడాది డిసెంబర్‌లో రెగ్యులర్ ఎంపీడీఓగా శ్వేత బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉన్నత చదువుల కోసం జాయిన్ అయిన మరుచటి నెలలోనే లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లి పోయారు. అలాగే ఈఓపీఆర్‌డీ కూడా చాలా ఏళ్ల నుంచి లేరు. గతేడాది ఒకరిని ఈఓపీఆర్‌డీగా వేయగా.. ఆయన అనారోగ్యం కారణంగా లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. దీంతో సూపరింటెండెంట్ వై.వెంకటరమణ ఇన్‌చార్జి ఎంపీడీఓగా.. సీనియర్ అసిస్టెంట్ ఎం. నాగభూషణరావు ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కూడా తరచూ ఆరోగ్య సమస్యల కారణంగా సెలవులు పెడుతుండడంతో మండల పరిషత్ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తంగా మారింది.

అన్నీ పెండింగ్‌లే....

ఇన్‌చార్జి అధికారుల పాలనలో వీరఘట్టం మండల పరిషత్‌లో చాలా పనులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. అలాగే మండలంలోని 34 పంచాయతీలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్యం క్షీణించింది. ఇటీవల చిన్నగోర కాలనీలో జ్వరాలు ప్రబలడంతో ప్రతి ఇంటిలోనూ ఒకరు జ్వర పీడితుడిగా మారారు. పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో గ్రామాల్లో పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయం పాలనపై దృష్టి సారించి రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనోత్సవం


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో గణనాథుని నిమజ్జనోత్సవంలో మహిళల కోలాటం


గరుగుబిల్లి: ఉల్లిభద్రలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జియ్యమ్మవలస: మండలంలోని చాలా గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మూడు రోజుల పాటు గణనాథునికి మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి ఆయన ఆశీర్వచనాలు అందుకున్నారు. వెంకటరాజపురం, బట్లభద్ర, కన్నపుదొరవలస, జోగులదుమ్మ, తుంబలి తదితర గ్రామాలలో సోమవారం గణనాథున్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి గుమ్మిడిగెడ్డలో నిమజ్జనం చేశారు.

అన్నదాన కార్యక్రమం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలోని రామాలయం వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే గరుగుబిల్లి, రావుపల్లి, గొట్టివలస, పెద్దూరు తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు

భామిని: మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులు కావడంతో కొన్ని గ్రామాల్లో విగ్రహాలను మేళతాళాల నడుమ నిమజ్జనం చేశారు. సింగిడి, నులకజోడు గ్రామాల్లో నిమజ్జనాలు జరగ్గా.. నేరడి–బిలో వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు.

జంపరకోట రిజర్వాయర్ పరిశీలన


వృథాగా పోతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, రైతులు

పాలకొండ: జంపరకోట రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో సాగునీరు వృథాగా పోతోందని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించారు. ఆ సమయంలో వైద్యులు లేకపోవడంతో డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. పట్టణంలోని గాయత్రీనగర్ కాలనీలో నిల్వ ఉన్న మురుగునీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సర్వేశ్వరరావును ఆదేశించారు. ఆయనతో పాటు గండి రామినాయుడు, గర్భాన సత్తిబాబు, గంటా సంతోష్, వెన్నపు శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

అధికారుల పర్యటన


లివిరి నదీ తీరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నిమ్మల శేఖరం

భామిని: మండల పరిధిలో సోమవారం కూడా ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. జిల్లా యంత్రాంగం హెచ్చరికలతో మండల అధికారులు తీరప్రాంత గ్రామాల్లో సోమవారం పర్యటించారు. తహసీల్దార్ నిమ్మల శేఖరం, డీటీ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది లివిరి, భామిని, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఒడిశాలో వర్షాలు పడకపోవడంతో వంశధార నిలకడగా ఉంది. లివిరి గ్రామస్తులో అధికారులు మాట్లాడి, పలు సూచనలు చేశారు.

నేలకొరిగిన పూరిల్లు


నేలకొరిగిన ఇంటి వద్ద బాధితులు

కొమరాడ: మండలంలోని కురుస్తున్న వర్షాలకు కెమిశీల పంచాయతీ తులసివలస గ్రామంలో డబ్బుకోట శ్రీరాములుకు చెందిన పూరిల్లు సోమవారం నేలమట్టం అయింది. ఆ ఇంట్లో కుటుంబ యజమానితో పాటు ఐదుగురు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. ఇల్లు కూలిపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, వర్షాలకు ఎక్కడ తలదాచుకోవాలో తెలియడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవడంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఆటోడ్రైవర్లపై కేసుల నమోదు

సీతంపేట: పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్న ఐదుగురు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పట్టుబడిన ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

ఎంఎంఎస్ కార్యవర్గం ఎన్నిక

వీరఘట్టం: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కె.లలితకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం శివున్నాయుడు సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా కందుల చంద్రకళ, కార్యదర్శిగా ఎం. కళావతి, ఉప కార్యదర్శిగా పైల పార్వతి, కోశాధికారిగా బలివాడ శ్రీదేవిలను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు లలితకుమారి మాట్లాడుతూ.. గ్రామ సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని.. అలాగే వీరఘట్టంలో ఏర్పాటు చేసిన మహిళామార్టు వ్యాపార అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు.

నీట మునిగిన పంట పొలాలు


పాలకొండ రూరల్: పాలకొండ మండలం వీపీ రాజుపేట సమీపంలో నీట మునిగిన పంట భూములు


పాలకొండ రూరల్: లుంబూరు, ఓని గ్రామాల్లో ఉడుపులు చేపడుతున్న రైతులు


పాలకొండ రూరల్: పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారిపై పారు వర్షపునీరు

పాలకొండ రూరల్ : వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలు సోమవారం తెరిపిచ్చినప్పటికీ, వాటి ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మండల పరిధిలోని భాసూరు, రాజుపేట, తుమరాడ గ్రామ పరిసర వరి పొలాల్లో భారీగా నీరు చేరింది. ఎత్తైన కొండల నుంచి వరద నీరు భారీగా రావడంతో ఆయా గ్రామాల్లోని పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పాలకొండ – వీరఘట్టం రహదారిపై నీరు పారుతుండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే తాజా వర్షాలను ఆసరాగా చేసుకుని మండలంలోని లుంబూరు, ఓని గ్రామాల్లో రైతులు ఉడుపులు చేపట్టారు.

విస్తారంగా వర్షం


గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలో సోమవారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో రోజువారీ కూలీలు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం కాస్త తెరిపిచ్చింది. పంట పొలాల్లో పుష్కలంగా నీరు చేరింది.

పాక్షికంగా నష్టం

గుమ్మలక్ష్మీపురం: కురుస్తున్న వర్షాలకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని లుంబేసు, పెదఖర్జ, జాబుగూడ, వంజరాపుగూడ, మర్రిగూడ గ్రామాల్లోని పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ అప్పారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది సోమవారం పర్యటించి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, నష్టం వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన నందివానివలసలో ఎస్సీ కాలనీ గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రకృతి వైపరీత్యాల నిధుల నుంచి రూ.95 వేలు ప్రభుత్వం విడుదల చేసినట్లు స్థానిక సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ సోమవారం తెలిపారు. 2023లో వచ్చిన గులాబ్ తుఫానుకు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. అయితే ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. నిధులు మంజూరైనప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసి పోవడంతో ప్రకృతి వైపరీత్యాల నిధుల నుంచి 58 కుటుంబాలకు చెరో రూ.95 వేలు చొప్పున నగదును వారి ఖాతాల్లో జమచేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాలకొండ రూరల్: పాలకొండ – సీతంపేట ప్రధాన రహదారిలో సోమవారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపడుతుండగా... సీఎల్ నాయుడు కాలనీ సమీపంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని ఎస్సై కె.ప్రయోగమూర్తి, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.62,220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యత


ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

పార్వతీపురం టౌన్: వినాయక ఉత్సవ మండపాల వద్ద అల్లర్లకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని పట్టణ సీఐ నారాయణరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకుండా చూడాల్సిన బాధ్యత కమిటీలదే అన్నారు. మండపాల వద్ద రాత్రి సమయాల్లో ఒక వ్యక్తి అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఎటువంటి అల్లర్లు జరిగినా కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఎస్సై సంతోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా..


పంట నష్టాన్ని అంచనా వేస్తున్న ఉద్యాన వన శాఖ అధికారి ప్రత్యూషభాను

మక్కువ: ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు మండలంలోని శంబర గ్రామంలో నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలను ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష భాను సోమవారం పరిశీలించారు. ఎంత విస్తీర్ణంతో పంట నష్టం జరిగిందో పరిశీలించి రైతుల వివరాలు సేకరించారు. నివేదకను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు రెవెన్యూ, ఉద్యానవనశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎన్‌సీఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం..

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర


కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఇటీవల శ్రీరామా సుగర్ మిల్ (కర్మాగారంలో గుర్తింపు యూనియన్, ఏఐటీయూసీ) లేబర్ యూనియన్ నాయకులు ఇచ్చిన వినతిపై ఆయన స్పందించారు. సోమవారం కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మిక నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూతపడిన ఎన్‌సీఎస్ కర్మాగారంలో క్రషింగ్ పునఃప్రారంభించేందుకు సాయశక్తులా కృషిచేస్తానని అన్నారు. ఇప్పటికే ఎన్‌సీఎల్ ప్రతినిధులతో పాటు, ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత మంత్రికి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు వివరించడం జరిగిందన్నారు. అలాగే యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్మాగారంలో యంత్రాలను చోరీ చేసిన నిందితులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై ఎం.రాజేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా యూనియన్ అధ్యక్షుడు కె.ప్రసాదరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వి.గోపాలకృష్ణ, కార్మాగారం ప్లాంట్ ఇన్‌చార్జి నాగరామారావు, యూనియన్ నాయకులు కొండలరావు, శర్మ, సుగర్ కేన్ సొసైటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగ విరమణ చేసిన కార్మికులు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు టి.వెంకటప్పలనాయుడు విజయవాడ వరద బాధితులకు రూ.25 వేలు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ద్వారా ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విజయవాడలో వరదల కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారికి తన వంతుగా సాయం చేసేందుకు ముందుకొచ్చిన వెంకటప్పలనాయుడును అభినందించారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి వరద బాధితులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశీపేట సర్పంచ్ టి.చంద్రశేఖర్, లచ్చయ్యపేట మాజీ సర్పంచ్ వి.గుంపస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, ఆర్.వేణునాయుడు తదిరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి..


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: నగర పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల ప్లానింగ్, శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. చెత్తకు వర్షపు నీరు చేరడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని చెప్పారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు అందించాలని సూచించారు. కాలువలపై నిర్మాణాలు గుర్తించి తొలగించాలని ఆదేశించారు. సాగునీటి కాలువలు, చెరువు గట్లపై ఆక్రమణలు చేపట్టిన వారిని గుర్తించి నోటీసులు అందించాలని ఆదేశించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు


ఉద్దవోలులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: వర్షాల కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉద్దవోలు, పెదగుడబ, చినగుడబ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను సోమవారం ఆమె పరిశీలించారు. పలుచోట్ల క్లోరినేషన్‌ను చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాలు, మంచినీటి బోర్లు, రహదారిపై మురుగునీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది ఉన్నారు.